# హక్కు

శాసించే అధికారం ఈ సమాజానికి ఉన్నప్పుడు ఆ కోరిక సహజమైనదైనపుడు, ఆ వ్యక్తి కోరేది సమకూర్చే బాధ్యత కూడా దానికుండాలి.

డియర్ అమరా!

"నేను రాయవేలూరు మెంటల్ హెల్త్ సెంటర్‌లో సోషల్‌వర్కర్‌గా జాయిన్ అయ్యి నెలయ్యింది - నా వార్డులో వున్న ఒక పేషెంటు విషాధకథ నన్ను కుదిపేసి నాచేత నీకీరోజు ఈ ఉత్తరం వ్రాయిస్తోంది. ఆమె పేరు త్రివేణి. ఆమె జియాలజీలో ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. నువ్వు రచయితవు. ఆమె అడిగే ప్రశ్నకు నువ్వయినా జవాబు చెప్పగలవేమోనని ఆమెకథను యధాతథంగా వ్రాస్తున్నాను.

---

"అవ్వగారూ! మీకేం కావాలో చెప్పండి. మీరేందుకలా వుంటున్నారు?" చెప్పండి అవ్వగారూ! "మీకెంకావాలో చెప్పండి"

ఆమె కన్నార్పకుండానావైపు చూసింది

నాకు....నాకు మమకారం కావాలి నేను చచ్చిన నాడు నాకొరకు ఒక కన్నీటి బొట్టు రాల్చే మనిషి కావాలి. చెప్పు చెప్పమ్మా తెచ్చి ఇవ్వగలవా? నువ్వు తెచ్చి ఇవ్వగలవా?" ఆమె ఆవేశపడి బోరున ఏడ్చింది ఆమె అడుగుతున్నది మందు కాదు మమకారం,.........

"మీకెవ్వరూ లేరా అవ్వగారూ!" జాలిగా చూస్తూ అడిగాను.

ఆమె విరక్తిగా చూసింది.

"నాబిడ్డ వున్నాడు తల్లీ"

"పోనీ లెండి అవ్వగారూ! మీకు.... మీ బిడ్డ....."నేనాగిపోయాను. ఆమె చూపుల్లో విరక్తి గుర్తొచ్చింది.

"నాబిడ్డ....." ఆమె ఎండిపోయిన కళ్ళల్లో మరలా తడి

"కరుణా! నాబిడ్డను నేను ప్రేమించినదాంట్లో విశ్వసించిన దాంట్లో వందోవంతయినా నేను దశరథరామ్‌ను అనుసరించి వుంటే, అతని అడుగులో అడుగు కలిపి వుంటే, ఇప్పుడు..... ఇప్పుడు ఇలా నీముందు బేలగా నిలబడి నామానసిక వ్యాధికి మందివ్వమని ధేవిరించే పరిస్థితి కలిగేది కాదమ్మా"

ఆమె జీవితంలో మరో ముఖ్యమైన పాత్ర దశరథరామ్ అనే అపురూపమైన వ్యక్తి అని అర్థమైపోయింది. ఆమె అతనిగురించి చెప్తుందేమోనని ఎదురు చూసిన రెండు నిముషాల తర్వాత నేను అడిగిన ప్రశ్న ఇది-

"ఇప్పుడు మీ అబ్బాయి ఏం చేస్తున్నాడవ్వగారూ?"

ఆమె దీర్ఘంగా నావైపుచూసి ఆగి ఆగి అంది

"ఆడమగతారతమ్యాల మధ్య అహంకారం పెంచుకుంటూ బీద గొప్పతారతమ్యాల గురించి ఆలోచించి, మానవత్వాన్ని కోల్పోతూ కులమతాల విబేధాలు సృష్టించుకుని సంకుచితుడైపోతున్నాడు తల్లీ"

"అది కాదు అవ్వగారూ!"

"అదేకాదమ్మా! తన అర్ధభాగం అయిన నాకోడల్ని నియంతగా పాలిస్తూ ఆపిల్ల కన్నీళ్లల్లో ఆనందాన్ని వెతుక్కుంటున్నాడమ్మా. తన అమ్మమ్మ ఒడిలో తానుకథలు విన్న విషయం మర్చిపోయి, తన బిడ్డలకు నాయనమ్మ ఎవరో తెలియకుండా అంత అందంగా స్టైల్‌గా పెంచుతున్నాడమ్మా వాళ్ళని!"

"అదేంటి మీరు మీ అబ్బాయితో లేరూ!"

"లేదమ్మా నా వ్యక్తిత్వం వాడికి అహంకారంగా నా క్రమశిక్షణ వాడికి నిరంకుశత్వంగా అగుపిస్తాయట అందుకు 'అమ్మా! నీకు కండలూ కోనలంటె ఇష్టం కదా' అని తిరుపతిలో ఇల్లు కట్టించి నన్ను ఒంటరిగా, ఏకాకిగా వదిలేసాడు"

అమరా! ఆమెను ఓదార్చే భాష నాకు చప్పున స్ఫురించలేదు ఆమె మరలా చెప్పసాగింది.

"నిజమేనమ్మా! నాకు కొండలూ, కోనలూ ఇష్టమే కానీ... కానీ ఇలా ఒంటరిగా కాదుగా! నాకు నిద్రలేచేసరికి గుండె దడదడ లాడ్తుంది. శూన్యంగా భయంకరంగా అన్పిస్తుంది. నాకెవరూ లేరనేభావం నన్ను చిత్రహింసపెడ్తుంది. అలాటి క్షణంలో నీకు నేనున్నాననే వ్యక్తితోడు నాకు కావాలమ్మా అప్పుడు నాకు కొండల్లో కోనల్లో కూడా

అందాలు కన్పిస్తాయి. అంతేకానీ ఇలా.... ఇలా.... ఒంటరిగా కాదుగా కరుణా! ఇలా నేను నాభావాలు వ్యక్తం చేస్తే పిచ్చిదాని క్రింద చూసారు. ఈ మెంటల్ హాస్పిటల్‌లో తోసారు" ఆమె ఈసారి పెద్దగా ఏడ్చేసింది.

ఆమెను నేను కాస్సేపు ఏడ్వనిచ్చాను. ఇన్నాళ్ళూ ఎండిపోయిన ఆమె గుండె ఏడవకపోతే పగిలిపోతుంది.

ఆమెకథ ఎవరికైనా అపరిచితులకు చెప్పుకుని వాళ్ళ గుండెల్లో కాసింత సహోర్తును, ఓదార్పును పొందకపోతే నాకు తెలుసు ఆమె మానసిక వ్యాధి నయంకాదు. అందుకే ఆమె కథంతా చెప్పించుకుని ఆమెలో తప్పున్నాసరే ఆమెను సమర్ధించి, ఆమెకు మానసిక ఆరోగ్యాన్నివ్వాలనుకున్నాను.

"అతనేం చదువుకున్నారు అవ్వగారూ?"

ఆమె విచారంగా చూసింది

"చదువా"?.... ఏమీ చదువుకోలేదు"

ఆశ్చర్యపోయాను నేను

పి. హెచ్.డి. చేసిన తల్లికి పుట్టిన కొడుకు ఏమీచదువుకోలేదా?

"మీరు అతన్ని బాగా చదివించి వుంటే అతను మిమ్మల్ని బాగా అర్థం చేసుకునుండే వాడేమో!"

"నిజమే.... నిజమే" గోణిగిందామె.

"నిజమే కరుణా! వాడు తెలివి తక్కువ వాడేంకాదు కానీ వాడితెలివి వక్రమార్గంలోకి తిప్పింది మా అమ్మమ్మ"

"మీ అమ్మమ్మ గారా?"

ఆమె మెల్లిగా లేచి కూర్చుంది.

"అవునమ్మా! అది మమకారమో? చాదస్తమో? నాకు తెలియదు, ఈ నాటికీ కానీ వాడిని పొట్టమీద కూర్చోబెట్టుకుని ఆమెచెప్పిన చదువు అంది"

'మీనాన్న తరుఫున ఆస్థి చాలా వుంది. మీ అమ్మకు మేమిచ్చిన ఆస్తిచాలా వుంది. ఇంకా చాలా సంపాదిస్తోంది. నువ్వు చదువుకోక పోయినా పర్వాలేదు' ఇదీ ఆమె చెప్పిన పాఠం.

నాకూ అర్థం కాలేదు అమరా! అది మమకారమో!చాదస్తమో?

"కానీ మీరయినా కాస్త శ్రద్ధ తీసుకునుండాల్సింది"నేను ప్రశ్నలు వేయకపోతే ఆమె చెప్పలేకపోతోంది. షాక్స్‌తీసుకుని, తీసుకుని ఆమె మేధస్సు మూగపోయినట్లుంది. ఆమె మాట్లాడే తీరులో మాత్రం ఒకనాటి ఆమె సంస్కారం, వివేకం స్పష్టంగా అగుపిస్తున్నాయి.

"శ్రద్ధా?" అని చిరిగిపోయిన సంఘటనలు గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోందావిడ.

"కాస్త దిండుసరిచేస్తావామ్మా! నేను పడుకుంటాను"

నేను దిండు సరిచేసాను.

"కరుణా! మా అమ్మగుర్తొస్తోందమ్మా ఆమె బ్రతికుంటే నన్ను చదివించినట్టే

నా బిడ్డనూ చదివించేది. మానాన్నతో తగువేసి నిరాహార దీక్షపట్టి నన్నింతదాన్నిచేసింది నాతల్లి....." తల్లి తాలూకు జ్ఞాపకాల్లోకి జారుకుందామె- నేనామెను ఈ లోకంలోకి తెప్పించే ఉద్దేశంతో అన్నాను.

"మీరూ మీ అమ్మగారి అడుగుజాడల్లో నడిచుండాల్సింది"

నిట్టూర్చిందామె

"నేనారోజుల్లో వాడి చదువుగురించి మా అమ్మమ్మతో, మా మామగారితో ఎలా విరోధం తెచ్చుకున్నానో ఈనాడు స్పష్టంగా నీకు చెప్పలేనమ్మా కరుణా! కానీ వాడినెప్పుడైతే నేను చదువుకోమని మందలిస్తానో అప్పుడు అమ్మమ్మ ప్రత్యక్షమయ్యేది"

"వాడికి చదువుకోవాల్సిన అవసరం లేదులే నాలుగుతరాలకు సరిపోయేంత ఆస్తి వుంది. నువ్వు సంపాదించి పెట్టక పోయినా వాడు సంపాయించుకోవాల్సిన అవసరం లేనంత ఆస్తిపాస్తుల్ని వాడికి చేర్చిపెట్టాము మేము."

"నేను ఎదురుతిరిగేదాన్ని. అమ్మమ్మ మీద కోపంతో వాడిని నాలుగు అంటించేదాన్ని"

'త్రివేణీ! వాడి ఒంటిమీద చెయ్యిపడ్తేనే నుఒప్పుకోను నాకు ఒక్కగానొక్క మనుమడు వాడు' అని వాడిని ఒళ్ళోకి తీసుకుని కళ్ళనీళ్ళు పెట్టుకునేది నిజమే నేనూ కరిగి పోయేదాన్నప్పుడు.

"కానీ కరుణా! ఆమె ప్రేమను వాడిముందు ఆవిధంగా వ్యక్తంచేయడం నేను హర్షించలేక పోయేదాన్ని. నేను చదువుకోమనడం, ఆమె చదువుకోవద్దనడం-అది వాడిచిన్న మనసులో అలానిల్చిపోయింది. చిన్నవయస్సులో మా అమ్మమ్మ మాటలు వాడికి రుచించడంలో అన్యాయమేమీలేదు. కానీ వాడు అలాగే అదే తీరులో పెరుగుతాడనుకోలేదమ్మా"

నేను మాట్లాడలేదు.

"అందులో కూడా పూర్తిదోషం వాడిదని నేననను. మా అమ్మమ్మ వాడికి చెప్పేకథలన్నిటిలోనూ బీద గొప్పతారతమ్యం, స్త్రీల పాతివ్రత్యాలూ, పురుషులకున్న హక్కులు ఇవే వుండేవి. అవి వాడిలో పాతుకు పోయాయి"

"మీరు అతన్ని ఏహాస్టల్లోనైనా వుంచాల్సింది"

ఆమె పూర్తిగా లేచి కూర్చుంది.

తనని అర్ధం చేసుకునే మనిషి తనకీనాటికి దొరికిందనేఉత్సాహం ఆమెకదలికల్లో చూసాను నేను.

"అదీ అయింది కరుణా! వాడుపూర్తిగా చెడిపోతున్నాడని చదువుమీద బొత్తిగా ధ్యాసలేదని పైగానాకూ వాడికీ మధ్యదూరం పెరిగిపోతోంది. నేను తెలుసుకున్నరాజు ఎంతో కష్టపడి మాకు చాలా దూరంగా ఓస్కూల్లో సీట్ సంపాదించాను కానీ..... కానీ" ఆమె ఏదో చెప్పబోయింది.కానీ అప్పుడే డాక్టర్ మారిస్ గారు రౌండ్స్కొచ్చారు.

"నువ్వు ఇక్కడున్నావు ఈ హవర్లో! డ్యూటీలో వున్నావా?" అని అడిగారు వస్తూనే.

నేను లేచినిలబడ్డాను.

ఈ రోజు మాత్రం ఆమెకాస్త డాక్టర్‌కి ప్రశాంతంగా జవాబులిచ్చింది ఆయనవెళ్ళి పోయాక నేను మరలా అడిగాను.

"చెప్పండవ్వగారూ!"

"చెప్తాను కరుణా! కాస్త నన్ను ఆలాన్‌లోకి తీసుకెళ్ళగలవా?"

నేను వెంటనే లేచి ఆమె చెయ్యిపట్టుకుని ఒక చెట్టు క్రింద బెంచీ మీద కూర్చో బెట్టాను.

'చెప్పండవ్వగారూ!' అనకుండానే మొదలెట్టిందీసారి

"నేనా సీటుసంపాయించినందుకు సంతోషపడ్డాను. ఒకప్రక్కవాడినివదిలి వుండాలంటే బాధగా వున్నా వాడుబాగుపడబోతున్నాడన్న ఆనందంలో ఉక్కిరి బిక్కిరయ్యాను. ఇంట్లో అమ్మమ్మతో ప్రచ్ఛన్న యుద్ధంచేసి ఆమె కన్నీళ్ళను, తిట్లను, శాపనార్థాలను అన్నిటినీ లెక్కచెయ్యకుండా ఒక్కదాన్నే వాడిని తీసుకెళ్ళి స్కూల్లో చేర్చి తిరిగొచ్చేలోపల మా మామగారు మాఇంట్లో వున్నారు. నేనెంతో ఆనందంగా ఆయన మనమణ్ణి అంతగొప్పస్కూల్లో చేర్పించిన విషయం చెప్పబోయేంతలో ఆయన కోపంగా సూటిగా అన్నారు.

"వాడిని నెలకు వెయ్యిరూపాయలు ఖర్చుచేసేస్కూల్లో చేర్పించావటనే వెంటనే తీసుకురమ్మని ఎవర్నయినా పంపు లేకపోతే......." ఆయన కాస్తసంకోచంగా ఆగారు.

ఆయనకు నామంచితనం తెల్సు. నేను ఆయనకిచ్చేగౌరవం తెల్సు.

నేను మాట్లాడలేదు

'చూడమ్మా! నువ్వు ఈ లెక్కన వాడిమీద ఖర్చు పెట్టబోయేడబ్బు అంతా ప్రక్కనవేస్తే మరో పాతికెకరాలు కొనుక్కోవచ్చు వాడు చదివిసంపాయించేది దాని వడ్డీకి కూడా గిట్టదు'

ఆయన జమాఖర్చుల మాటలు నాకు చాలా విసుగ్గా అన్పించాయి. కానీ నేను అవుననలేదు కాదనలేదు. నేను మాత్రం ఎవరెన్ని చెప్పినా నేను వాడి భవిష్యత్తును పాడుచెయ్యదల్చుకోలేదు.

ఆరాత్రి మా అమ్మమ్మ నా ప్రక్కన వచ్చిపడుకుంది.

"చూడు త్రివేణీ! నువ్వు కృష్ణను ఇంటికి తీసుకురాకపోతే ఆయన తన ఆస్థి తన అన్నబిడ్డలకు వ్రాసేస్తారట"

"నేను మా అమ్మమ్మ వైపు చాలా అసహ్యంగా జుగుప్సగా చూసాను".

"అది జరిగేపని కాదు. ఆస్థి పాస్తులు వాడిని రేప్రొద్దున ఉద్ధరించలేవు నువ్వువాడిని బాగుపడనీఅమ్మమ్మా"

ఆమె కోపంగా లేచి వెళ్ళిపోయింది.

ఆమె చెప్పడం ఆపింది. చాలాసేపు ఎదురుచూచిన నేను,

"మీకు అలసటగావుందేమో వెళ్ళిపడుకుంటారా?" అని అడిగాను లేస్తూ.

"లేదు... లేదు నాకు చాలాబాగుంది నువ్వు ఇంటికివెళ్ళాల్సిన టైమ్ అయిందేమో" చుట్టూ చూసాను కాస్త చీకట్లు కమ్ముకుంటున్నాయి. కానీ నేను ఆమె చెప్పేది

వినందేలేవదర్చుకోలేదు.

ఈరోజున్న మూడ్ రేపు ఆమెకుంటుందని గ్యారంటీలేదు.

నేనలా అనుకుంటా మరలా కూర్చున్నాను.

"అయితే చెప్పండి ఆతర్వాతేమయింది?" అన్నానుకాస్త ముందుకు వంగి

ఆతర్వాతా... ఒక్క నెలరోజులు మా మామగారి ద్వారా మా అమ్మమ్మ ద్వారా నరకం అనుభవించాను కరుణా! ఆ రోజుల్ని ఇప్పటికీ మర్చిపోలేనమ్మా. అంత మెంటల్ టార్చర్‌కి గురుచేసారు వాళ్ళు నన్ను"

"ఆతర్వాతేమయిది!" మరలా అడిగాను

"అంతా అయిపోయింది తల్లీ నేను వాళ్ళ మాట విననని అర్ధమయిపోయి వాడిని హాస్టల్‌లో నుండి తీసుకొచ్చేసారు"

డ్యూటీనుండి దిగిపోతూ మాణిక్యం లైటు వెలిగించి వెళ్ళిపోతున్నాడు.

"చూడూ మాణిక్యం! ఓగంట వుంటావా? నాతో టౌన్ దాకా వస్తువు"

"అలాగే అమ్మాగారూ!" అని వాడు వెళ్ళిపోయాడు నేనుఆలోచనల్లోకి జారుకున్నాను. ఆకథలో నాకు కావల్సిన పాత్రలు మరో రెండున్నాయి ఒకటి ఆమె ఇంతవరకు చెప్పని ఆమె భర్త గురించి, రెండోది ఆమె చెప్పిన ధశరధరామ్ గురించి.

మెల్లిగా సంకోచంగా అడిగాను.

"మీరేం అనుకోకపోతే అవ్వగారూ మీవారు........"

చాలా అప్రసన్నమైన విషయంవిన్నదానిలా చూసి దానిని ఇంక పొడిగించడం ఇష్టం లేదన్నట్టు నన్ను మధ్యలోనే కట్ చేసింది.

"ఆయన కృష్ణ నాకడుపులో వుండగానే వెళ్లి పోయాడు." ఆమె జవాబును నేను ఊహించలేదు ఆమె నుదుటమీద బొట్టు వుంది.

"క్షమించండి అవ్వగారూ! మీకు అన్యాయం చేసి ఎక్కడోదూరంగా వున్నాడనే అనుకున్నానుగాని ఇలా వూహించలేదు.

ఆమె నా పూర్తి మాటలు విన్నట్టులేదు.

"అన్యాయం ఎందుకు చేయలేదమ్మా చెసిందే అది"

"అలా అనకండి విధి చెసిందానికాయనేం చేస్తారు మీకు కావాలని అతను దూరం కాలెదు కదా? ఇక్కడ సైకోథెరపిస్టనైన నేను ఆమె పేషెంటనే విషయం మర్చిపోయాను.

"కావాలనే పారిపోయాడమ్మా లేకుంటే నాకీబాధెందుకుంటుంది? బ్రతికున్నాడో గతించిపోయాడో కూడా తెలియదు"

గత కాలపు జ్ఞాపకాల తాలూకు వ్యధ ఆమె ముడతలుపడ్డ ముఖంలో కూడా స్పష్టంగా కన్పించింది నాకు

"అదెలా జరిగిందవ్వగారూ!" అని అడక్కుండా వుండలేకపోయాను.

"ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్" గొణిగిందామె

నేను మూగదాన్నయిపోయాను కారణం ఎదైతేనేం అతను ఆమెకు చాలా

అన్యాయం చేసాడు.

ఆమె మరలా చెప్పసాగింది.

అతను ఎం ఎషాప్ అయ్యారు పాస్అయి నాలుగేళ్ళయినా నాపెళ్ళయ్యి సంవత్సరమయినా అతనికి ఉద్యోగం రాలేదుఅసలతను గట్టిగా ప్రయత్నించిందీ లేద్ను వారి స్నేహితులెవరో ఒకరోజు జోక్ చేసారు 'వాడికేంలే భార్య సంపాయించి పెడ్తోంది హాయిగా తింటున్నాడు. మనకలాటి అదృష్టాలు లేవుగా' అని అంతే ఆ జోక్ నా జీవితాన్ని కూడా కాటేసింది.

ఆమె ఆ సంభాషణతో మారలాను మొదటి మూడ్లోకి వెళ్ళిపోతుందేమోనని భయ పడ్డా. అందుకే నాకు కావాల్సిన మూడోవ్యక్తి గురించి, ఆమె అపురూపంగా చెప్పుకున్న దసరథరామ్ గురించి అడిగాను.

"అతను అతనెవరని చెప్పమంటావమ్మా?" నా జీవితంలో అపురూపంగా దొరికిన స్నేహితుడు, ప్రేమించి, మోసగించబడ్డ అభాగ్యుడు, ఇంకా నన్ను ప్రేమిస్తూనే వున్న అమాయకుడు.

ఆమె అభాగ్య జీవితంలో మరో ఘట్టమన్న మాట అది అతనితో ఆమె వివాహం కాకపోవడానికి కారణాలు వెతుకుతూఅడిగాను.

మరేమీ అనుకోకపోతే అతనిది మీ కులంకాదా అవ్వగారూ?" అలా అడిగాక అలా అడిగినందుకు నామీద నాకే కోపం వచ్చిన సంగతి వేరేది. ఆమె అతని విషయాలు చెప్పడానికి మాత్రం చాలా ఉత్సాహపడింది.

"అతనికులం అతనికే తెలీదమ్మా అతను ఆర్ఫన్ తల్లీ తండ్రీ ఎవరో తెలియని అనాథ తోడూనీడా లేని ఏకాకి. కేవలం తనని విపరీతంగా అభిమానించే వ్యక్తిఒకరు కావాలనే అభాగ్యుడతను. అతనికి నా డబ్బుమీద తప్ప నా మీద అభిమానం వుండదనీ, వుండ లేదనీ తీర్మానంచేసి అతని మనస్సుమీద పెద్దగాయమే చేసారనుకో తల్లీ మా వాళ్ళు ఇంతకూ అతని కులం నాకు తెలీదుకానీ ఓ తమాషా చెప్పనా కరుణా! అతను ఎవరూ లేని అనాథ అయితే నేను అందరూ వున్న అనాథను మా ఇద్దరిదీ మాత్రం ఒకే కులమామ్మా మా ఇద్దరికీ కావాల్సింది అభిమానం, అదే మా కులం."

"అవ్వగారూ అతనిప్పుడెక్కడున్నాడు?"

నాకొరకు నిరీక్షించి నిరీక్షించి విసిగి వేసారి స్టేట్స్ కెళ్ళిపోయాడు.

'మీరు కాస్త ధైర్యం చేయ్యాల్సింది అవ్వగారూ!'

"ధైర్యం చేసుండాల్సింది నిజమే కానీ కరుణా చెప్పానుగామ్మా నా బిడ్డను విశ్వసించిన దాంట్లో వందోవంతయినా నేను అతన్ని విశ్వసించివుంటే ఈ రోజుఇలా నీముందు కూర్చుని ఈ ప్రసంగం చేయాల్సిన అవసరం వచ్చుండేది కాదు."

నేను మాట్లాడలేదు. నాకు ఆమెకథ అర్థమయిపోయింది.

"నేను ఆరోజుల్లో చాలాపిరికిదాన్ని కరుణా! నేను రామ్ని పెళ్ళిచేసుకునే పక్షంలో మా మామగారు, మా అమ్మమ్మ కూడా నాక్రిష్ణకు రావాల్సిన ఆస్థిని వాడికి ఇవ్వమన్నారు. దాంతో వాడి భవిష్యత్తును అన్యాయం చేయడం ఇష్టంలేక, నా భవిష్యత్తునే ముక్కలు చేసుకుని ఇదిగో ఇలా పిచ్చాసుపత్రిలో వున్నాను"

"అవ్వగారూ! ఇది పిచ్చాసు పత్రికాదు మీరలా అనుకోవద్దు. మీ మానసిక ఆరోగ్యం కోలుకోవడానికి మీకు కాస్త సహాయం అందించడానికి మాత్రమే మేమంతా ఇక్కడున్నామంతే"

ఆమె నామాటలు విన్పించుకోలేదు. చాలా ఆవేశంగా అంది

"ఈ పవిత్ర భారతదేశం తన గడ్డమీద పుట్టిన ఆడబిడ్డల్ని రెండో పెళ్ళి చేసుకోవద్దంటోంది. వ్యభిచరిస్తే మాత్రం చూసీ చూడనట్లుంటోంది"

"నీకు నేనువున్నా అననా అన్న, నీ పరువు ప్రతిష్ఠలు పోతాయి రెండోపెళ్లి చేసుకోవద్దన్న నా సోదరుడు, నా బిడ్డ పతనమైపోయిననాడు, నేను ఏడుస్తున్న రోజుల్లో ఒక్కసారన్నా నాగడపలోకి తొంగిచూసి."

"చెల్లీ! నీకు నేనున్నాను అని అనలేదుకరుణా! ఒంటరిగా మిగిలిపోయిన నన్ను, చెడిపోయిన మనవడ్ని చూసిపైలోకంలో వున్న మా అమ్మమ్మ బహుశా ఇప్పుడు పశ్చత్తాపపడ్తూ వుంటుంది. ఇక్కడ ఈలోకంలో ఆమె చాదస్తపు ప్రేమకు ఫలితం నేను నా కోడలు, కూడా అనుభవిస్తున్నాం తల్లీ'

నేను కదిలిపోయాను అమరా! తల్లిలాటి అమ్మమ్మ చేత, భర్తచేత, బిడ్డచేత మోస గించబడ్డ త్రివేణి గారి కథవిని చలించిపోయాను.

అమర ఉత్తరం చదవడం ఆపి క్షణం ఆలోచించింది. 'తన కడుపున పుట్టిన బిడ్డను, తనదిగా భావించే మనిషి తన సృష్టికి కారణమైన తల్లినెందుకు తన స్వార్థపు పరిధిలోకి తీసుకోలేక పోతున్నాడు? నిట్టూర్చి మరలా ఉత్తరం తెరిచింది అమర.

"మీ మనుమలూ, మనుమరాళ్ళూ......" లేచి బెడ్ సరిచేస్తూ మామూలుగా అడిగిన నా ప్రశ్న ఆమె నాడీమండలంలోని ఏసున్నితపు పొరను తాకిందో, ఆమె కంట్లో వెచ్చటి కన్నీరు

"సారీ అవ్వగారూ!"

ఆమె నిట్టూర్చింది

"పర్వాలేదమ్మా! నీతో మాట్లాడుతుంటే కొంత గుండెభారం తగ్గినట్టుగావుంది. చెప్పనీమ్మా"

ఐదు నిముషాలు పట్టింది ఆమె కోలుకుని తిరిగి తన కథను ప్రారంభించడానికి

"నేను నా మనవాళ్లవి, మనుమరాల్నీ చూసి పాతిక సంవత్సరాలయ్యింది"

"వాళ్లకు పెళ్లిళ్లయ్యాయా?"

"అయ్యాయట"

"అంటే.... మిమ్మల్ని పిలవకుండానే....'

"ఆ అవును అలాగే జరిగాయి" ఆమె గొంతు వణికింది

"అమ్మా! కరుణా! బిడ్డని తొలిసారి పొత్తిళ్లల్లో చూసుకున్నపుడు ప్రతి తల్లీ ఆ బిడ్డను పెంచిపెద్దచేసి ప్రయోజకుణ్ణిచేయాలనుకోవడం సహజం, ఇంకాస్త ముందుకెళ్తే.... 'నా మనవల పెళ్లి చూసేంత వరకు బ్రతకుతానో లేదో!' అని తన జీవితకాలంలో ఒక్కసారయినా వాపోవడమూ సహజమే. నేనూ అలాగే అనుకున్నాను. బ్రతికేవున్నాను అయినా నా మనుమల పెళ్లి నేను చూడలేకపోయాను. చిన్నప్పుడు కొంగు వదలని బిడ్డ

పెళ్లయ్యాక ఆ కొంగు చాటున బ్రతకడానికి ఇష్టపడదు. దానికి పెద్దవాళ్లు సంసిద్ధులు కావాలి. కానీ వంశవృక్షాన్ని కళ్లతో చూసుకోలేని బ్రతికున్న మనిషి చరిత్ర నాదికాక మరెవరికైనా వుంటుందా కరుణా! అని ఆమె బర్స్టు అయింది. ఆ రాత్రి నేను ఆమె దగ్గర పడుకున్నాను.

అమరా! చెప్పు ఆమె ఇంకా బ్రతికి ఆరోగ్యం బాగుచేసుకోవడం అవసరమంటావా? ఈమాటే నా నోటిదాకా వచ్చి ఆగిపోయింది.

వ్రాస్తూ పోతే ఇలా ఎన్నో నాకర్థంకాని ప్రశ్నలు. కళ్లు తెరిచిన మొదటిక్షణం మనిషి చూసేది తన తల్లినే మరి అలాటి తల్లిని ఎందుకు వాళ్లు నెగ్లెక్ట్‌చేస్తున్నట్టు! అలాటి వాళ్లను మన సంఘం ఎందుకు బహిష్కరించడంలేదు?"

అమరా! ఈ ఆవేశంలో వ్రాస్తే ఈ ఉత్తరం మహా గ్రంధమే అయ్యేలా వుంది ఇక ఆపుతాను

వుంటాను
ప్రేమతో నీనేస్తం
కరుణ

అమర అలాగే ఉత్తరం పట్టుకుని ఆ అవమానిత మానసిక గోష్టను ఊహిస్తూ అలాగే వుండిపోయింది.

'డెబ్బైఏళ్ల ఓ వృద్ధురాలు. భర్తపోయిన స్త్రీ, ఓనలభై ఏళ్ల వెనక్కువెళ్లి తనను ప్రేమించిన దశరధరామ్‌ను కాదన్నందుకు ఇప్పుడు పశ్చాత్తాప పడేలా చెసిన మన సాంఘిక ధర్మం ఎంత హీనమైంది!'

'శాశించే అధికారం వున్న ఈ సమాజానికి సమాజంలో ఒకరైన ఓ వ్యక్తి కోరే ఓ సమంజసమైన కోరికను తీర్చే బాధ్యత కూడా ఉండాలి.' నిట్టూర్చింది అమర.